కొత్తపంటకు శ్రీకారం

అనంత జిల్లాలో ఆయిల్ పామ్ సాగు

- పైలెట్ ప్రాజెక్టుగా ఆరు మండలాల్లో..
- తొలి దశలో 750 ఎకరాల్లో...
- వంద శాతం సబ్సిడీపై మొక్కల పంపిణీ
- మూడు కంపెనీలకు బాధ్యతలు

ఆయిల్ పామ్ సాగు ద్వారా లాభాలివే..

ఇది మార్కెట్‌లో ఎల్లప్పుడూ డిమాండ్ కలిగిన పంట. పామాయిల్ గెలల ధరను ప్రభుత్వమే ప్రకటిస్తుంది. ఆ ధర మేరకు నిర్దేశించిన కంపెనీలు రైతుల నుంచి కొనుగోలు చేస్తారు. పామాయిల్ యాక్ట్ 1993 ద్వారా రైతుల ప్రయోజనాలు పరిరక్షించేలా చర్యలు తీసుకుంటారు. మొక్కలు నాటిన మొదటి నాలుగు సంవత్సరాలు అంతర పంటలుగా వేరుశనగ, కంది పత్తి, మిరప, బొప్పాయి, మునగ, మినుము, పెసర, కూరగాయల పంటలుసాగు చేసుకోవచ్చు. మొక్కలు నాటిన తర్వాత నాలుగు సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల వరకు నిరంతర దిగుబడి ఇస్తూ రైతులకు మంచి ఆదాయాన్ని ఇస్తుంది. నాలుగో సంవత్సరం నుంచి ప్రతి నెలా గెలలు కోసిన ప్రతి సారి రైతుకు ఆదాయం వస్తుంది. ఈ పంటకు తెగుళ్లు, చీడపీడలు ఆశించడం చాలా తక్కువగా ఉంటుంది. ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాలతో ఎలాంటి ఇబ్బంది ఉండదు. వ్యవసాయ కూలీల అవసరం చాలా తక్కువగా ఉంటుంది. ఆయిల్ పామ్ పంట సాగు పర్యావరణ హితంగా పేర్కొంటున్నారు.



కుడేరు మండలంలోని పొలంలో నాటిన ఆయిల్ పామ్ మొక్కలు

అనంతపురం అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆయిల్ పామ్ పంట సాగుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలోని కూడేరు, కణేకల్లు, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్, ఉరవకొండ, వజ్రకరూరు మండలాల్లో పంట సాగు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆయా మండలాల్లో తొలి దశలో 750 ఎకరాల్లో పంట సాగు చేయాలని లక్ష్యం విధించారు. గత మూడు నెలలుగా ఆయిల్ పామ్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇప్పటి దాకా 250 ఎకరాల్లో ఆయిల్ పామ్ పంట సాగు చేశారు. సుస్థిరమైన, నికరమైన ఆదాయాన్ని అందిస్తూ, మార్కెట్‌లో ఎప్పుడూ డిమాండ్ ఉండే వంట నూనె పంట ఆయిల్ పామ్. ఎంకే అగ్రోటెక్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి కూడేరు, కణేకల్లు మండలాలను కేటాయించారు. రియా ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రైవేటు లిమిటెడ్‌కు బొమ్మనహాళ్, డి. హీరేహాళ్, వ్యాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి ఉరవకొండ, వజ్రకరూరు మండలాలను కేటాయించారు. ప్రతి కంపెనీకి 250 ఎకరాల చొప్పున 750 ఎకరాల్లో ఆయిల్ పామ్ తోటలను పెంచేలా లక్ష్యాన్ని విధించారు. నిర్దేశించిన కంపెనీల ద్వారా కోస్టారికా, ఇండోనేషియా, థాయిలాండ్ తదితర దేశాల నుంచి దిగుమతి చేసుకున్న నాణ్యమైన మొక్కలు సరఫరా చేస్తున్నారు. కంపెనీ సిబ్బందితో నిరంతర పర్యవేక్షణ చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. కంపెనీల ఆధ్వర్యంలో రైతులకు అందుబాటులో గెలల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. అక్కడే గెలలు తూకం వేసి రసీదు ఇస్తారు. గెలలు సరఫరా చేసిన రెండు వారాల్లోపు ప్రభుత్వం ప్రకటించిన ధరను కంపెనీలు చెల్లించేలా నిర్ణయం తీసుకున్నారు. వేసవి కాలంలో కూడా నీటి వసతి కలిగిన రైతులు మాత్రమే ఆయిల్ పామ్ పంట సాగు చేయాలని ఉద్యాన అధికారులు సూచిస్తున్నారు.

వందశాతం సబ్సిడీతో..

ఉద్యాన శాఖ ద్వారా ఆయిల్ పామ్ తోటల సాగుకు ప్రభుత్వం సబ్సిడీ వర్తింపజేస్తోంది. ఒక్కో రైతు 25 ఎకరాల వరకు ఆయిల్ పామ్ మొక్కలు నాటుకోవచ్చు. ఆయిల్ పామ్ మొక్కలు ఎకరాకు 57 చొప్పున 9 మీటర్ల దూరంలో నాటుకోవాలి. వంద శాతం రాయితీతో ఉచితంగా మొక్కలు అందిస్తారు. ఒక ఆయిల్ పామ్ మొక్క ధర రూ.193 ఉంది. రైతులకు ఉచితంగా అందిస్తున్నారు. అలాగే హెక్టారుకు ఎరువుల కోసం రూ.5250లు చొప్పున 4 సంవత్సరాల దాకా రాయితీపై ఉద్యాన శాఖ అందిస్తుంది. మొదటి నాలుగు సంవత్సరాలు అంతర పంటలపైనా ఒక రైతుకు గరిష్ఠంగా 25 ఎకరాల దాకా రూ.5250లు అందజేస్తారు.

త్వరలో నర్సరీల ఏర్పాటుకు చర్యలు

ఎంకే కంపెనీ ఆధ్వర్యంలో కూడేరు మండలంలో నర్సరీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే రియా కంపెనీ ఆధ్వర్యంలో బొమ్మనహాళ్ మండలం లాల్ బహదూర్ నగర్‌లో నర్సరీని ఏర్పాటు చేసి ఆల్రా మొక్కలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సన్నద్ధమవుతున్నారు. అప్పటి దాకా రైతులకు కావాల్సిన మొక్కలను తూర్పు గోదావరి, తెలంగాణ ప్రాంతాల నుంచి రవాణా ఖర్చులను కంపెనీలు భరించి రైతుల పొలాల వద్దకు చేరుస్తున్నారు.



కూడేరులో నాటేందుకు సిద్ధంగా ఉంచిన ఆయిల్ పామ్ మొక్కలు

ఆయిల్ పామ్ ఉపయోగాలు..

వంటల్లో నూనెగా వాడుతారు. కూరలు, పప్పులు అన్ని వంటలకు ఉపయోగి స్తారు. ఇది కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. హృదయ ఆరోగ్యాన్ని కాపాడుతుంది. కేన్సర్ నివారణలోనూ సహాయపడుతుంది. అలాగే సబ్బులు, శాంపులు, క్రీమ్స్ తయారీలో వీటిని ఉపయోగిస్తారు. మె కానికల్ ఇండస్ట్రీలో పాలిష్ చేసేందుకు వినియోగిస్తారు. బయోడీజిల్ త యారీలో ఉపయోగిస్తా రు. వాహనాలకు ఇంధనం గా వినియోగిస్తారు. వ్యవసాయ పరంగా ప్రకృతికి దోహద పడే ఎరువుల తయారీ, పురుగు మందుల తయారీలో ఉపయోగిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లా రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సుస్థిరమైన నికరమైన ఆదాయాన్ని అందిస్తూ మార్కెట్‌లో ఎప్పుడూ డిమాండ్ ఉండే వంట నూనె పంట ఆయిల్ ఫాం సాగు కోసం ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోంది. ఉద్యాన శాఖ ద్వారా వంద శాతం సబ్సిడీతో రైతులకు ఆయిల్ పామ్ మొక్కలు పంపిణీ చేస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో తొలి దశలో ఆరు మండలాల్లో ఆయిల్ పామ్ సాగును మూడు కంపెనీలకు కేటాయించాం. ఆయిల్ పామ్ సాగుపై వివరాల కోసం స్థానిక ఉద్యాన అధికారులు, ఆయా కంపెనీల ప్రతినిధులను సంప్రదించాలి. ఈ అవకాశాన్ని ఆయా మండలాల రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

-నరసింహారావు, ఉద్యాన శాఖ జిల్లా అధికారి

యమా..డేంజర్..!

అధికలోడుతో ఆటోల్లో ప్రయాణం

పరిమితికి మించి కూలీలు, ప్రయాణికుల తరలింపు

తరచూ ప్రమాదాలు...



యాడికిలో ఆటోలో ప్రమాదకరంగా కూలీల ప్రయాణం

యాడికి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆటోల్లో తరచూ పరిమితికి మించి కూలీలు, ప్రయాణికులను తరలిస్తున్నారు. దీంతో ప్రమాదాలు ఎక్కువగానే జరుగుతున్నాయి. అయితే వీటిని అరికట్టడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణంగా త్రీవీలర్ ఆటోలో నలుగురిని మాత్రమే ఎక్కించుకోవాలి. కొందరు డ్రైవర్లు 15మంది కూడా ఎక్కించుకొని ఆటోలు నడుపుతున్నారు. ఫోర్‌వీలర్ ఆటోలో ఏడుగురిని మాత్రమే ఎక్కించుకోవాలి కానీ నిబంధనలకు విరుద్ధంగా 20మందికి పైగా ఎక్కించుకుంటున్నారు. లగేజీ బొలెరో వాహనంలో కూలీలను ఎక్కించుకోకూడదు. కానీ కిందా పైన రెండు వరుసలు ఏర్పాటు చేసి ఒక్కో వరుసలో 20మంది ప్రకారం 40మందిని తరలిస్తున్నారు. పరిమితికి మించి ప్రయాణికులను తీసుకువెళ్లడం, ప్రమాదాల బారిన పడడం తరచూ జరుగుతున్నా అధికారులు వీటిని నిలువరించే దిశగా చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల మండలంలోని వేములపాడు జాతీయ రహదారిపై 17మంది కూలీలు వెళుతున్న ఆటోకు ప్రమాదం జరగడంతో ఒక మహిళా కూలీ మృతిచెందింది. మిగిలిన వారంతా తీవ్రంగా గాయపడ్డారు. ఆదర్శపాఠశాల సమీపంలో అధిక పరిమితితో ప్రయాణికులను తీసుకువెళుతున్న ఆటో ప్రమాదం బారిన పడి గుత్తికి చెందిన ఒక వ్యక్తి మృతిచెందిన సంఘటన ఉంది. యాడికి నుంచి బుగ్గవైపు పరిమితికి మించి కూలీలను తీసుకువెళుతున్న ఆటో ప్రమాదం బారినపడి ఒక మహిళా కూలీ మృతి చెందింది. మరో ముగ్గురు కూలీలు గాయపడ్డారు. పరిమితికి మించి ప్రయాణికుల తరలింపు, ఆటోల్లో లౌడ్‌స్పీకర్ల వినియోగం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, మైనర్లు డ్రైవింగ్ చేయడం, డ్రైవరు సీటుకు ఇరుపక్కల ప్రయాణికులను కూర్చొబెట్టుకోవడం వంటి కారణాలతో ప్రమాదాలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. వీటిని పూర్తిస్థాయిలో నిలువరించాలని అధికారులను స్థానికులు కోరుతున్నారు.



బొలెరోలో రెండు వరుసల ప్రయాణం.. ఈ ప్రయాణాలను అరికట్ట గలరా..



గుత్తిలో పిస్తోల్ కలకలం



గుత్తిలో లభ్యమైన పిస్తోల్

గుత్తి,నవంబరు24(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని జడ్‌వీరారెడ్డి కాలనీలో ఆదివారం పిస్తోల్ కలకలం రేపింది. ఓ ఇంటి వెనుక భాగంలో ప్లాటు ఏర్పాటుకు రాళ్లను తొలగిస్తుండగా రాళ్ల కింద పిస్తోల్ బయట పడింది. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. సంఘటన స్థలానికి ఎస్‌ఐ సురేష్ చేరుకొని ఆ పిస్తోల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అయితే ఈ పిస్తోల్ రెండు రోజుల కిందటే లభ్యం కావడంతో పోలీసులు విషయాలను రహస్యంగా ఉంచి విచారణ చేస్తున్నట్లు సమాచారం.

ఉరంతా కన్నీరు

ఎల్లుట్లలో మిన్నంటిన ఆర్తనాదాలు

7

8మందికి అంత్యక్రియలు పూర్తి

నివాళులు అర్పించిన ప్రముఖులు

అండగా ఉంటామని హామీ



శ్మశానంలో విలపిస్తున్న కుటుంబ సభ్యులు

ఆలయాలను సందర్శించిన జిల్లా న్యాయాధికారి

తాడిపత్రి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రాచీన ఆలయాలైన బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయం, శ్రీ చింతల వెంకటరమణస్వామి ఆలయాలతోపాటు సంజీవనగర్‌లోని వేదమాత గాయత్రీ అమరలింగేశ్వర స్వామి ఆలయం, శివసాయిమందిరాలను ఆదివారం జిల్లా న్యాయాధికారి శ్రీనివాసులు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఆయా ఆలయాల్లో స్వామివారికి న్యాయాధికారి ప్రత్యేక పూజలు జరిపించారు. ప్రాచీన ఆలయాల విశిష్టత గురించి అర్చకులను అడిగి తెలుసుకున్నారు.



శివసాయి మందిరంలో జిల్లా న్యాయాధికారి

హాల్‌టిక్కెట్లు ఇవ్వకపోతే చర్యలు : కలెక్టరు



అనంతపురం టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య కారణం చూపి, విద్యార్థులకు హాల్‌టిక్కెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడితే చర్యలు తప్పవని కలెక్టరు వినోద్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. డిగ్రీ, ఇంటర్ కళాశాలలకు చెందిన ప్రతి విద్యార్థికి తరగతులు, ప్రాక్టికల్స్ విషయంలో ఎక్కడా ఇబ్బంది పెట్టకూడదన్నారు. ఇందుకు విరుద్ధంగా వ్యవహరించే కళాశాలలపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొంతమంది కళాశాలల ప్రిన్సిపాళ్లు పరీక్షలు, తరగతులకు రానీయకుండా ఇబ్బంది పెడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వచ్చాయన్నారు. విద్యార్థుల సర్టిఫికెట్లను ఎలాంటి హోల్డ్ చేయకూడదని ప్రభుత్వం ఆదేశాలిచ్చిందన్నారు. ఎవరైనా కళాశాలల ప్రిన్సిపాళ్లు హోల్డ్ చేస్తే ఆ కళాశాలలను సీజ్ చేస్తామని కలెక్టరు హెచ్చరించారు. ఫీజును కళాశాలల అకౌంట్లలోకి ప్రభుత్వం జమ చేస్తుందని, అందుకే విద్యార్థులకు ఏ కళాశాలలోను ఇబ్బందులు పెట్టకూడదని కలెక్టరు తెలిపారు.

నేడు కళ్యాణదుర్గంలో ఫిర్యాదుల స్వీకరణ

ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం సోమవారం కళ్యాణదుర్గంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టరు వినోద్‌కుమార్ తెలిపారు. కళ్యాణదుర్గంలోని ఆర్డీటీ ఎకాలజీ సెంటర్‌లో ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలను తెలియజేసి పరిష్కరించుకోవాలని కలెక్టరు కోరారు.

ఊరంతా కన్నీరు

ఎల్లుట్లలో మిన్నంటిన ఆర్తనాదాలు

8మందికి అంత్యక్రియలు పూర్తి

నివాళులు అర్పించిన ప్రముఖులు

అండగా ఉంటామని హామీ



తల్లిదండ్రుల మృతదేహాలను చూసి బోరున విలపిస్తున్న బీఎస్ఎఫ్ జవాను హర్షవర్ధన్



సొమ్మసిల్లిపోయిన మహిళను పక్కకు తీసుకువెళుతున్న దృశ్యం



భార్యభర్త మృతదేహాలకు అంత్యక్రియలను నిర్వహిస్తున్న దృశ్యం

పుట్లూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఊరంతా ఏడుపులు, పెడబొబ్బలు, ఆర్తనాదాలే. ఎవరిని పల కరించినా కంట కన్నీరు తప్ప నోటమాట రావడం లేదు. తమకు అయిన వారికి కడసారి వీడ్కోలు పలికేందుకు ఊరంతా బంధువులు, స్నేహితులతో నిండిపోయింది. ఇదీ మండలంలోని ఎల్లుట్ల గ్రామంలో ఆదివారం పరిస్థితి. గార్లదిన్నె మండలం తలగాసిపల్లి వద్ద శనివారం జరిగిన ఘోరరోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాలపెద్దయ్య, చిన్ననా గమ్మ, చిన్ననాగన్న, రామాంజనమ్మ, జయరా ముడు, కొండమ్మ, ఈశ్వరయ్య, పెద్దనాగమ్మల మృతదేహాలను ఆదివారం మండలంలోని ఎల్లుట్ల గ్రామానికి తీసుకురావడంతో ఆర్తనాదాలు మిన్నం టాయి. ఒకేసారి గ్రామానికి చెందిన 8మంది మృతి చెందడంతో ఊరంతా విషదంలో మునిగిపోయింది. కడసారి తమవారిని చూసేందుకు బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు పెద్దఎత్తున తరలివ చ్చారు. పలువురు రాజకీయ ప్రముఖులు వచ్చి మృతదేహాలకు నివాళులు అర్పించి, బాధిత కుటుం బాలను ఓదార్చారు. అంత్యక్రియల నిమిత్తం మృత దేహాలను అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి అంబులెన్స్‌లో ఉదయం 8గంటలకల్లా గ్రామానికి చేర్చారు. గ్రామసరిహద్దులో మృతదేహాలను చూసిన గ్రామస్థులు దుఃఖాన్ని ఆపుకోలేక బోరుమ న్నారు. కొందరు మహిళలు సొమ్మసిల్లిపడిపో యారు. మరికొందరు మృతదేహాల మీదపడి రోదిం చారు. మృతదేహాలను ఇళ్లకు చేర్చడానికి సుమారు అరగంట సమయం పట్టింది. అనంతరం మృతదే హాలకు సంప్రదాయం ప్రకారం చేయాల్సిన కార్యక్ర మాలు నిర్వహించారు. ఈ సమయంలో కుటుంబ సభ్యులను ఓదార్చడం ఎవరితరం కాలేదు. కొద్దిసే పటి తర్వాత అతికష్టం మీద మృతదేహాలను అంత్యక్రియల కోసం అంబులెన్స్‌లోనే శ్మశానవాటి కకు తరలించారు. అంత్యక్రియలను ఎక్స్‌కవేటర్ సాయంతో నిర్వహించారు. ఆర్డీఓ కేశవనాయుడు అంత్యక్రియలను దగ్గరుండి చేయించారు.

బాధితులకు అండగా ఉంటాం: బండారు శ్రావణిశ్రీ, ఎమ్మెల్యే

రోడ్డు ప్రమాదంలో ఒకే గ్రామానికి చెందిన 8మంది మరణించడం ఎంతో బాధాకరమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదివారం తెలి పారు. మృత దేహాలకు నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు అన్నివిధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. జాతీయ రహదారులపై ప్రమాదాలు జరిగే చోట సూచికబోర్డులు ఏర్పాటుచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించామ న్నారు. అనంతరం బాధితుల ఇళ్లకు వెళ్లి ఆర్థికసాయం అందించి అండగా ఉంటామని తెలిపారు. ఆమె వెంట టీడీపీ నాయకులు ఆలం నరసానాయుడు, కేశవరెడ్డి, సుద ర్శన్‌నాయుడు, చవ్వా కులశేఖర్ రెడ్డి, విజయ్‌కుమార్‌నాయుడు, గోవర్ధన్‌రాజు రవీంద్రచౌదరి తది తరులు ఉన్నారు.



మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యేలు



మృతదేహాలను స్మశానానికి తరలించడంతో ఇంటివద్ద రోదిస్తున్న బంధువులు

మనసును కలచివేసింది: ఎమ్మెస్ రాజు, మడకశిర ఎమ్మెల్యే

రోడ్డుప్రమాదం తన మనసును తీవ్రంగా కలచివేసిందని మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు పేర్కొన్నారు. ఎల్లు ట్లలో పర్యటించి మృతదేహాలకు నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రమా దంపై ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామన్నారు. ప్రభుత్వం తరఫున రూ.5లక్షల పరిహారాన్ని సీఎం చంద్రబాబు ప్రకటించారని తెలిపారు. ప్రభుత్వం నుంచి రావాల్సినవి తప్పకుండా అందేలా చర్యలు తీసు కుంటామని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి: జేసీ ప్రభాకర్‌రెడ్డి, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్

ప్రభుత్వం ఇచ్చే రూ.5లక్షలు బాధిత కుటుంబాలకు ఏమాత్రం సరిపోదని వాటికి తగ్గట్లు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎల్లుట్లలోని శ్మశానం వద్ద ఆదివారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగం డిమాండ్‌పై స్పందించకపోతే ఊరు మొత్తాన్ని తీసు కెళ్లి కలెక్టరేట్ స్పందనలో ధర్నాకు కూర్చొంటామని హెచ్చరించారు. త్రీవీలర్ ఆటోలను బ్యాన్ చేయాలన్నారు. డ్రైవర్ సీటులో అటు ఇటు నలుగురిని కూర్చొబెట్టుకుంటే స్టీరింగ్ ఎలా తిరుగుతుందని ప్రశ్నించారు.

మాజీ ఎమ్మెల్యే యామినీబాల కంటతడి

రోడ్డు ప్రమాదంలో మృతులను చూసి మాజీ ఎమ్మెల్యే యామినీబాల బోరున విలపించారు. ఇలాంటి దురదృష్ట కర సంఘటన ఎన్నడూ జరగలేదని చెప్పారు. మృతదేహాలకు నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదా ర్చారు. ఆమె వెంట టీడీపీ నాయకుడు సతీష్ తదితరులు ఉన్నారు.

అధైర్యపడవద్దు.. ప్రభుత్వం అండగా ఉంటుంది

రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు మంత్రి కేశవ్ భరోసా

పరిహారం చెక్కుల పంపిణీ



బాధిత కుటుంబీకులకు చెక్కు అందజేస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

పుట్లూరు, నవంబరు24(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా గార్ల దిన్నె మండలం తలగాసిపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో మృతిచెం దిన, గాయపడిన వారి కుటుంబాలను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆదివారం రాత్రి పరామర్శించారు. అధైర్యప డవద్దనీ, ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. బస్సు- ఆటో ఢీకొన్న ఈ ప్రమాదంలో ఎనిమిది మంది మరణిం చగా.. ఐదుగురు గాయప్డారు. బాధితులంతా జిల్లాలోని పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామానికి చెందినవారు. మృతు లకు స్వగ్రామంలో ఆదివారం అంత్యక్రియలు పూర్తి చేశారు. మంత్రి కేశవ్.. ఎల్లుట్ల గ్రామానికి చేరుకుని, బాధితుల ఇళ్ల వద్ద కెళ్లి పరామర్శించారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.5లక్షల ఎక్స్‌గ్రే షియో చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు రూ.5లక్షల చొప్పున పరిహారాన్ని చెక్కుల రూపంలో ఇచ్చామన్నారు. ప్రభుత్వం తరఫున అవుట్‌సోర్సింగ్ ద్వారా ఉద్యోగ అవకాశం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. బాధి తుల పిల్లలను కోరినచోట చదివిస్తామని హామీ ఇచ్చారు. బాధి తులను ఆదుకునే బాధ్యత ప్రభుత్వానిదే అని మంత్రి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావ ణిశ్రీ, కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్ పాల్గొన్నారు.

అమ్మా... దండం పెట్టి చెబుతున్నా..!

ఇంతమంది ఒకే వాహనంలో ప్రయాణం చేయకండి

శుభకార్యానికి వెళుతున్న బృందానికి మంత్రి సవిత సూచన



గార్లదిన్నె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): 'అమ్మా.. మీకు దండం పెడతా.! ఇలా నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణం చేయకండి. ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే అప్పుడు ఎవరు దిక్కు. అందుకే జాగ్రత్తలతో ప్రయాణం చేయండి' అని మంత్రి సవిత లగేజీ బొలెరో వాహనంలో శుభకార్యానికి వెళుతున్న వారికి సూచించారు. మండలంలోని తలగాసిపల్లి జంక్షన్ వద్ద 44వ జాతీయ రహదారిపై శనివారం ఆటోను బస్సు ఢీ కొనడంతో 8 మంది కూలీలు దుర్మరణం చెందగా మరో ఐదుగురు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ప్రమాదం జరిగిన స్థలాన్ని జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి వీర్రాజు, అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, శింగనమల సర్కిల్ సీఐ కౌలుట్లయ్య, ఎంవీఐ సునీత, ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా తదితరులు ఆదివారం పరిశీలించారు. ఈ క్రమంలోనే గుత్తి మండలం పెద్దొడ్డి గ్రామానికి చెందిన పలువురు నూతిమడుగుకు గ్రామానికి పెళ్లి చూపుల కోసం లగేజీ బొలోరో వాహనంలో బయల్దేరారు. ఆ వాహనాన్ని అధికారులు తలగాసిపల్లి క్రాస్ వద్ద నిలిపారు. అదే సమయంలో అటుగా వెళుతున్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తన వాహనాన్ని ప్రమాద స్థలం వద్ద ఆపారు. ప్రమాదం ఎలా జరిగిందని జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి వీర్రాజు, డీఎస్పీ వెంకటేశ్వర్లుతో ఆరా తీశారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ క్రమంలో తమ వాహనాన్ని పంపించాలని శుభకార్యానికి వెళుతున్న వారు మంత్రి సవితకు విన్నవించారు. లగేజీ వాహనాలలో ప్రయాణం చేయడమే తప్పు. నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువమంది ప్రయాణించడం ఏంటని ప్రశ్నించారు. ప్రమాదాలు జరిగితే మనమే తప్పు పడతాం. అలాంటిది ఇలాంటి వాహనాలలో ఎలా ప్రయాణిస్తారని ప్రశ్నించారు. లగేజీ వాహనాలలో ప్రయాణం చేయద్దని, మీకు కావాలంటే మరో వాహనం ఏర్పాటు చేస్తాం అందులో వెళ్లాలని మంత్రి వారికి కి సూచించారు.



మాట్లాడుతున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి లక్ష్మీనారాయణ

తల్లిదండ్రులు మూస ధోరణి వీడాలి

పిల్లల అభిరుచులను ప్రోత్సహించాలి

ఆలిండియా సర్వీసులకు పంపించాలి

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కొడిదెల లక్ష్మీనారాయణ



వనభోజన కార్యక్రమానికి హాజరైన కమ్మ కులస్థులు

గుంతకల్లు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తాము సాధించ లేని లక్ష్యాలను తమ పిల్లలు పూర్తిచేసేలా చూసే మూస ధోరణిని విడ నాడి, వారి ఉత్సాహం ఎందులో ఉందో తెలుసుకుని ప్రోత్సహించాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి కొడిదెల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఆది వారం స్థానిక శ్రీ శంకరానందగిరి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కమ్మ సంఘ కార్తీక వన భోజన కార్యక్రమానికి లక్ష్మీనారాయణ ముఖ్య అతి థిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ భారతదే శంలో తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంజనీరింగ్ చేయించాలన్న తలం పుతో ఉన్నారని అన్నారు. ప్రపంచం చాలా విశాలమైనదని, ఒక్క ఇంజ నీరింగును చదివించడమే లక్ష్యంగా పెట్టుకోకుండా మారుతున్న కాలాను గుణంగా పిల్లల మనోభీష్టాన్ని అనుసరించి ప్రోత్సహించాలన్నారు. కమ్మ కులస్థుల్లో ధన సంపాదనా వ్యామోహం పెరిగిపోయిందని, ఉద్యోగ, వ్యాపార రంగాలతోపాటు పరిపాలనా విభాగంలోకి కూడా దృష్టిని సారించాలన్నారు. ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ లాంటి ఆలిండియా సర్వీ సెసులు, రాజకీయాల్లోనూ రాణించాల్సిన అవసరం ఉందన్నారు. పిల్ల లకు తెలుగు బాగా నేర్పించాలని, మాతృభాష అలవడినప్పుడే ఇతర భాషలను అభ్యసించడం సులభమవుతుందన్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషలే కాకుండా ఇతర భాషలను కూడా నేర్చుకునేలా పిల్ల లను ప్రోత్సాహించాలని అన్నారు. ఆచార, సంప్రదాయాలను అనుసరి స్తూనే నూతన సాంకేతికతను చేజిక్కించుకుని కెరీర్‌ను నిర్మించుకోవాల న్నారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కార్యక్రమం చివరలో సమావేశా నికి వచ్చి కమ్మ కుల సంఘ ప్రముఖులను, సంఘ నాయకులను కలి శారు. ఈ సందర్భంగా లాస్య, విశిష్ఠ, పూజిత ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో మార్కెట్ ఫెడరేషన్ డైరెక్టర్ కేసీ హరి, టీడీపీ నాయకులు బండారు ఆనంద్, చింటిలి వెంకటేశ్వర్లు, కమ్మ సేవా సంఘం అధ్యక్షుడు రాఘవేంద్ర, కార్యదర్శి బాబు, ట్రెజరర్ డాక్టర్ రామ్మూర్తి, కొట్టాల సురేశ్‌నాయుడు, ప్రిన్సిపాళ్ల గోపాల్, వరప్రసాద్ తది తరులు పాల్గొన్నారు.



కాకతీయ వనమహోత్సవ వేదికపై మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే పరిటాల సునీత తదితరులు

రాప్తాడు : అఖిల భారత కాకతీయల ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వ ర్యంలో ఐకమత్యంగా కార్తీక వనభోజనాలు నిర్వహించడం అభినంద నీయమని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఆది వారం మండలంలోని హంపాపురం సమీపంలో 44వ జాతీయ రహ దారి పక్కన అఖిల భారత కాకతీయ ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వ ర్యంలో నిర్వహించిన కార్తీక వనభోజనాల కార్యక్రమానికి మంత్రితో పాటు రాప్తాడు, అనంతపురం ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గు పాటి ప్రసాద్, మాజీ ఎమ్మెల్యేలు ఉన్నం హనుమంతరాయచౌదరి, వైకుంఠం ప్రభాకర్‌చౌదరి, ధర్మవరం టీడీపీ నాయకులు గొర్తి సుధాక ర్‌నాయుడు, భారతీదేవి, జిల్లాలోని ఇతర ప్రజా ప్రతినిధులు, నాయ కులు హాజరయ్యారు. శృంగేరి శంకర మఠం పీఠాధిపతి విద్యారణ్య భారతీస్వామి ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులను ఆశీర్వదిం చారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ కార్తీక మాసంలో ఐకమత్యంగా వనభోజనాలు నిర్వహించడం శుభపరి ణామం అన్నారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ ఎన్టీ రామారావు, పరిటాల రవీంద్ర లాంటి వారు కమ్మ కులంలో జన్మించి పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలిచార న్నారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లా డుతూ కష్టాల్లో ఉన్నవారికి సాయం అందించడంతో కమ్మ కులం ఎప్పటికీ ముందు ఉంటుందన్నారు. కార్యక్రమంలో అనంతలక్ష్మి చైర్మ న్ అనంతరాముడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు మంత్రులు, ఎమ్మెల్యేల పరామర్శ

ఆరోగ్య పరిస్థితిపై ఆరా... అండగా ఉంటామని హామీ





బాధితుల కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న మంత్రులు సత్యకుమార్, టీజీ భరత్

అనంతపురం టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గార్లదిన్నె మండలం తలగాసిపల్లిక్రాస్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితులను మంత్రులు, ఎమ్మెల్యేలు ఆదివారం పరా మర్శించారు. రాష్ట్ర వైద్యశాఖామంత్రి సత్యకుమార్, జిల్లా ఇన్‌చార్జ్‌మంత్రి, పరిశ్రమలశాఖామంత్రి టీజీభ రత్, ఎమ్మెల్యేలు బండారు శ్రావణి, ఎంఎస్‌రాజు, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, టీడీపీ జిల్లా అధ్య క్షుడు వెంకటశివుడుయాదవ్‌తదితరులు వేర్వేరుగా బాధితులను పరామర్శించారు. మంత్రులు వెంట జిల్లా కలెక్టరు వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్ వచ్చారు. క్షతగాత్రుల వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని అందుకు అవసరమైన డబ్బు ప్రభుత్వం అందిస్తుందని సవీరా ఆస్పత్రి యాజమాన్యం, డాక్టర్లకు మంత్రులు సూచిం చారు. అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు మాట్లా డుతూ నిరుపేద కూలీలు ప్రమాదంలో ఎనిమిది మంది ఒకే ఊరివారు మరణించడం బాధాకరమ న్నారు. ఇప్పటికే మృతుల కుటుంబాలకు సీఎం చంద్రబాబు రూ.5లక్షల సాయం ప్రకటించారన్నారు. క్షతగాత్రుల వైద్యచికిత్సలకు అవసరమైన డబ్బును ప్రభుత్వమే ఖర్చు పెడుతుందన్నారు. ఎవరూ ఆందో ళన చెందాల్సిన అవసరంలేదని, ప్రభుత్వం అండగా ఉంటుందని బాధితులు, వారి కుటుంబసభ్యులకు భరోసా ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, సరిపూటిరమణ తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా ఆ ఐదుగురి ఆరోగ్యం: డాక్టర్లు

ప్రమాదంలో గాయపడిన కూలీలు రామాంజినమ్మ, గంగాధర్, లక్ష్మీదేవి, పెద్దులమ్మ, డ్రైవరు నీలకంఠేశ్వర కిమ్స్ సవీరా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరందరి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని ఆస్పత్రి వైద్యులతో పాటు డీఎంహెచ్‌ఓ డాక్టరు ఈబీ. దేవి తెలిపారు. వీరిలో గంగాధర్ మాత్రమే ఇంకా ఐసీయూలో ఉన్నారని, మిగిలిన బాధి తులు సాధారణ వార్డులో చికిత్స పొందుతున్నా రని డీఎంహెచ్‌ఓ తెలిపారు. కలెక్టరు, మంత్రులు ఆదేశాల మేరకు బాధితులకు అన్ని రకాల వైద్యసేవలను అందిస్తున్నామని డీఎం హెచ్‌ఓ అన్నారు.

లక్ష్మీనరసింహస్వామి

ఆలయంలో చోరీ

రూ. 8 లక్షల విలువైన ఆభరణాల అపహరణ

కళ్యాణదుర్గం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కంబ దూరు మండలం కదిరిదేవరపల్లిలో వెలసిన లక్ష్మీనర సింహస్వామి ఆలయంలో శనివారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన మేరకు.. కార్తీక మాసం కావడంతో శనివారం రాత్రి వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. స్వామిని బంగారు, వెండి ఆభరణాలతో అలంక రించారు. తరువాత ఆలయానికి తాళాలు వేసుకుని వెళ్లిపోయారు. ఆదివారం ఉదయం అర్చకుడు తిప్పే స్వామి తాళాలు పగులగొట్టినట్లు గుర్తించారు. విష యాన్ని గ్రామస్థుల ద్వారా పోలీసులకు తెలిపారు. డీఎస్పీ రవిబాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌తో కూడా క్షుణ్ణంగా పరిశీలించారు. శని వారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయ పరిసర ప్రాంతాల్లో సంచరించారని, వారే ఈ దొంగతనానికి పాల్పడి వుండవచ్చునన్న అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. ఆలయంలో వున్న హుండీని కూడా ధ్వంసం చేశారు. బంగారం, వెండి ఆభరణాలు, హుండీలో నగ దును కూడా ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. సుమారు రూ. 8 లక్షల వరకు చోరీకు గురై వుంటుందని గ్రామ స్థులు తెలిపారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా

పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆర్యవైశ్య మహాసభ యువజన సంఘం నాయకులు

అనంతపురం కల్చరల్, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలో ఏ ఒక్క ఆర్యవైశ్యునికి సమస్య వచ్చినా అండగా నిలిచి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కేటీఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వ హించిన ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర యువజన సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి భరత్‌తోపాటు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకు మార్ యాదవ్ హాజరయ్యారు. ప్రమాణ స్వీకారో త్సవ సభలో భరత్ మాట్లాడుతూ తెలుగుదేశ పార్టీ ఆర్యవైశ్యులకు ఎంతో ప్రాధాన్యం ఇస్తోంద న్నారు. సీఎం చంద్రబాబునాయుడు తనపై నమ్మ కంతో రాష్ట్రానికి ఎంతో కీలకమైన పరిశ్రమలశా ఖకు తనను మంత్రిగా చేశారని కొనియాడారు. దేశ, విదేశాల నుంచి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు తరలివస్తున్నార న్నారు. జిల్లాలో ఆర్యవైశ్యుల సత్రం ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానన్నారు. మంత్రి సత్యకు మార్ యాదవ్ మాట్లాడుతూ సేవకు మారుపేరు ఆర్యవైశ్యులని, వారి సేవా కార్యక్రమాలను మరిం తగా విస్తరించి యువతకు ఆదర్శంగా నిలవాల న్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లా డుతూ ఆర్యవైశ్యులు వ్యాపారులు మాత్రమే కాదని, సామాజిక సేవకులు కూడా అని పేర్కొ న్నారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటే శ్వర ప్రసాద్ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల ఐక్యత చూస్తుంటే తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ ఆర్యవైశ్యుడైన పొట్టిశ్రీరాములు పోరాటంతోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధన జరిగిందని, ఆ మహనీ యుని సామాజికవర్గమైన ఆర్యవైశ్యులంతా ధన్యు లేనని కొనియాడారు. అనంతరం ఆర్యవైశ్య మహా సభ రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు శబరి వరప్రసాద్‌తోపాటు కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌ప ర్సన్ బోయ గిరిజమ్మ, టీడీపీ నాయకులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, జన సేన నాయకుడు భవానీ రవికుమార్, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నిరామ సత్యనారా యణ, గౌరవాధ్యక్షుడు పెనుగొండ సుబ్బరాయుడు, నాయకులు కోటా సత్యం, తిరువీధుల జగదీష్ కుమార్, దేవకీ వెంకటేశ్వర్లు, శిరిగుప్ప వెంకటే శ్వర్లు, మనోజ్, కలవల సతీష్, వంకదారు వెంకట కృష్ణ, ముడియం రమణ, గోపా మచ్చా నరసిం హులు, పిన్ని నాగరత్నం పాల్గొన్నారు.

సమస్యల స్టేషన్

- నత్తనడకన లిఫ్ట్ పనులు
- ప్లాట్‌ఫామ్స్‌లో మరుగుదొడ్ల కరువు
- కొళాయిల వద్ద అపరిశుభ్రత
- ఇబ్బందులు పడుతున్న రైలు ప్రయాణికులు


ట్రాక్ దాటుతున్న ప్రయాణికులు

అనంతపురం న్యూటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అనంతపురం రైల్వే స్టేషన్ సమస్యలకు నిలయంగా తయారైంది. చాలా అసౌకర్యాలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, వికలాంగుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఒక ప్లాట్ ఫామ్ నుంచి మరో ప్లాట్‌ఫామ్‌కు చేరాలంటే నరకప్రాయంగా మారింది. మెట్లు ఎక్కాలంటే చేతకా ర్రు. ట్రాక్‌పై వెళ్లాలంటే ప్రమాదకరం. లిఫ్ట్ నిర్మాణ ప నులు నత్తనడకే నయం అన్న చందంగా సాగుతు న్నాయి. వీల్‌చైర్‌లో వెళ్లడా నికి కూడా కాదోవే అను కూ లంగా లేదనే విమర్శలు వి నిపిస్తున్నాయి. రామ చంద్ర నగర్ గేట్ వైపు మాత్రం కాలి బాట ఏర్పాటు


నత్తనడకన సాగుతున్న లిఫ్ట్ పనులు

చేశారు. అయితే ప్రయాణికు లు ఎక్కువ శాతం పీటీసీ వైపు నుంచి నగరంలోకి వెళుతుంటారు. ఈ మార్గం వికలాంగులు, వృద్ధులు వెళ్లడం నరకంగా మారింది.

మరుగుదొడ్లు కరువు

అనంతపురం రైల్వే స్టేషన్‌లోని నాలుగో ప్లాట్ ఫామ్ వైపు నూతన స్టేషన్ నిర్మాణం జరుగుతోంది. దీం తో ఆ ప్లాట్‌ఫామ్ మీదుగా రైల్లు రాకపోకలు పూర్తిగా నిలి చిపోయాయి. దీంతో 4వ ప్లా ట్‌ఫామ్ మీదుగా బెం గళూరు వైపు వెళ్లాల్సిన రైళ్ల ను మూడో ప్లాట్‌ఫామ్ మీదుగా పంపుతున్నారు. ఇక గుత్తి వైపు వెళ్లే రైళ్లు దాదాపు ఒకటో ప్లాట్‌ఫామ్ నుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే సాయం త్రం సమయంలో ఒకే సారి రెండు రైళ్లు వచ్చినప్పుడు రెండో ప్లాట్‌ఫామ్ మీదుగా రాకపోకలు మళ్లిస్తున్నారు. దీంతో రెండు, మూడు ప్లాట్‌ఫామ్స్‌లో ఒక్కసారిగా రద్దీ పెరిగిపోతోం ది. ఈ ప్లాట్‌ఫామ్స్‌లో కనీసం మరుగుదొడ్లు లేకపో వడంతో ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. అదే విధంగా రైల్వే స్టేషన్‌లోని 2, 3వ ప్లాట్‌ఫామ్స్‌లో నిర్వహణ దారుణంగా తయారైంది. అక్కడి నీటి కొళా యిల వద్ద మురుగు పేరుకుపోయి ప్రయాణికులు వినియోగించు కోలేని స్థితి నెలకొంది.

కనిపించని సీసీ కెమెరాలు

రైల్వే స్టేషన్ అంటే మొత్తం సీసీ కెమెరాల నిఘా లో ఉండటం సర్వ సాధారణం. ఎలాంటి పొరపాటు జరిగిన అందులో పట్టుకోవచ్చు. అయితే అనంత రైల్వే స్టేషన్‌లోను పాతభవనం ఉన్న సమయంలో సీసీ కెమెరాలు ఉండేవి. పలు సందర్భాల్లో సీసీ ఫుటేజీల ద్వారానే నిందితులను సకాలంలో పట్టుకున్నారు. అయితే పునర్నిర్మాణంలో భాగంగా పాత స్టేషన్ ను తొలగించారు. అయితే ప్రస్తుతం రద్దీ ఉన్న ప్రాంతాల్లో అయినా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే ప్రయాణికుల భద్రతకు కొద్దిగా అయిన దోహదపడే అవకాశం ఉందని ప్రజలు అంటున్నారు.

లిఫ్ట్ లేకపోవడం ఇబ్బందికరమే...



ఉద్యోగ రీత్యా రెగ్యులర్ గా గుంతకల్లు నుంచి అ నంతపురానికి రైలులో వ స్తాం. నాలుగో ప్లాట్ ఫామ్‌లో నిర్మాణాలు జరు గుతుండడంతో అక్కడ రైళ్ల రాకపోకలు లేవు. దీంతో రెండు లేదా మూడో ప్లాట్ ఫామ్ నుంచి రాకపోకలు సాగించాల్సి ఉంది. వాటి నుంచి నాలుగో ప్లాట్‌ఫామ్‌కు వెళ్లాలంటే ఇబ్బం దికరంగా ఉంది. లిఫ్ట్ లేకపోవడంతో వృద్ధులు, విక లాంగులకు చాలా అసౌకర్యంగా ఉంటోంది. అధికారు లు స్పందించి వీలైనంత త్వరగా లిఫ్ట్ వినియోగంలోకి వచ్చేలా చూడాలి.

- బాబా, ప్రయాణికుడు, గుంతకల్లు

మెట్లు ఎక్కడం కష్టంగా ఉంది



విధి నిర్వహణలో భా గంగా ప్రతి రోజు గుంతక ల్లు నుంచి అనంతపురాని కి రైల్లో రాకపోకలు సాగి స్తాం. అయితే అనంతపు రం రైల్వే స్టేషన్‌లో ప్ర యాణికులకు కొంత అసౌ కర్యాలు ఉన్నాయి. ప్లాట్ ఫామ్ మారేందుకు ఇక్కడ ఉన్న మెట్ల ఎక్కడం కంటే చాలా మంది ట్రాక్ దాట డానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వెంటనే సమస్యను పరిష్కరించాలి.

- గోవిందరాజు, ప్రయాణికుడు, గుంతకల్లు

సంక్షిప్తం

నెలాఖరుకు సరుకులు చేరాలి

శింగనమల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నెలాఖరులోగా రేషన్ సరుకులు ప్రభుత్వ చౌకడిపోలకు చేరాలని జిల్లా సివిల్ సప్లై అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. ఆయన ఆదివారం శింగనమల సివిల్ సప్లై స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేశారు. ప్రతి స్టాక్ పాయింట్ నుంచి ప్రభుత్వం సరఫరా చేస్తున్న నిత్యవసర సరుకులు నెలాఖరి లోగా రేషన్ షాపులకు చేర్చాలని సూచించా రు. ఈ నెల కార్డుదారులకు కందిపప్పు, చ క్కెర అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

ఆదాయం రూ.4.28 లక్షలు

అనంతపురం రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మా ర్కెట్‌కు పశువులసంతతో రూ. 4,28,620 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.2,58,170, ఆదివారం జరిగిన ఎనుములు, ఆవుల సంతతో రూ.1,70,450 వచ్చిందని తెలిపారు.

అందుబాటులో పశువైద్యశాల

కనగానపల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని నిరుపయోగంగా ఉన్న పశు వైద్యశాలను పాడి రైతులకు అందుబా టులోకి తెస్తామని జిల్లా పశు వైద్యాధికారి శుభదాస్ పేర్కొన్నారు. రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన పశువైద్యశాలను ఆయన ఆదివా రం పరిశీలించారు. రైతులు కోరిక మేరకు గ్రామంలోని పాతభవనంలో పశువులకు వైద్య సేవలు కొనసాగిస్తున్నా కొత్త భవనం లో వైద్య సేవలందేలా చర్యలు తీసుకుంటా మన్నారు. కార్యక్రమంలో డీడీ చంద్రశేఖర్, పశువైద్యులు సునీల్ కుమార్ ఉన్నారు.

అంతరాయం కలిగిస్తే చర్యలు

నార్పల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే లారీకి పని చెప్పాల్సి వస్తుందని ఎస్ఐ సాగర్ హె చ్చరించారు. ఆయన ఆదివారం నార్పల క్రాసింగ్, పాతబస్టాండ్ వద్ద వాహనదా రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రికార్డులు లేని పలు వాహనాలకు జరిమా నా విధించారు.

పేకాట స్థావరంపై దాడి

- రూ.13.18 లక్షలు స్వాధీనం

శింగనమల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరువెందల గ్రామ శివార్లలో పేకాట స్థావరంపై స్పెషల్ పార్టీ పోలీసులు దాడి చేసి, రూ.13.18 లక్షలు స్వాధీనం తెసుకున్నట్లు ఎస్ఐ శరత్ చంద్ర తెలిపారు. తాడిపత్రి ప్రాంతానికి చెందిన 30 మంది జూదరులు పేకాడుతున్నట్లు సమాచారం సమాచారం అందడంతో ఆదివారం సా యంత్రం స్పెషల్ పార్టీ దాడి చేశారన్నారు. పేకాడుతున్న 20 మందిని అరెస్టు చేసి, నాలుగు ద్విచక్రవాహనాలు, రెండు కార్లు, 25 సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ.13.18 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

● అనంతపురం క్రైం: పేకాడుతున్న ఏడుగుని నాలుగో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. నగర శివారులోని దాబా ఫ్యాక్టరీ ప్రహరీ వెనకవైపు కంపచెట్లలో పేకాడుతు ఉగా నాలుగో టౌన పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ రాంప్రసాద్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఏడు మంది జూదరులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ. 22,600 స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

చెన్నేకొత్తపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆమిదాలకుం ట గ్రామ సమీపంలో ఆదివారం ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి ద్విచక్రవా హనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ వృద్ధు డు తీవ్రంగా గాయపడ్డాడు. వెల్దుర్తికి చెం దిన ఆంజనేయులు అనే వృద్ధుడు ద్విచక్ర వాహనంలో కొత్తచెరువుకు బయలుదేరా డు. ఆమిదాలకుంట సమీపంలో ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ఘటనలో ఆంజనేయులుకు తీవ్రగాయా లు కాగా ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలిం చారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

సత్వర న్యాయ సేవలందాలి

అనంతపురం సెంట్రల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం కోర్టును ఆశ్రయించే కక్షిదారులందరికీ సత్వర న్యాయ సేవలందించేలా న్యాయ వ్యవస్థను పటిష్ఠం చేయాల్సిన అవసరముందని బహు జన లాయర్స్ ఫోరం(బీఎల్ఎఫ్) రాష్ట్ర అధ్య క్షుడు నారాయణప్ప పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం విజయవాడలో బీఎల్ఎఫ్ ప్రథమ వార్షికోత్సవాన్ని నిర్వహించి తీర్మానం చేసినట్లు ఆయన తెలిపారు. ముఖ్య అతిథులుగా రిటైర్ డీజీపీ పూర్ణచంద్రరావు, రిటైర్ జడ్జి ఎం.శ్రీధర్ హాజరై మాట్లాడారన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

గార్లదిన్నె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక శివాలయం వద్ద ఆదివారం అంగరంగవైభవంగా అయ్యప్ప పడి పూజ కార్యక్రమం జరిగింది. ప్రతి ఏడాది కా ర్తీక మాసం ఈ పడి నిర్వహించి అన్నదానం చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. సోమవారం ఉదయం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప భక్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు రాము, చంద్ర, శ్రీనివాసులు, గేటుశ్రీరాములు, వెంకటేశు, కిష్ట, చంద్ర, శివ, మధు, ప్రతాప్, నల్లప్ప, రవి, నవీన్, నరసింహులు, కిరణ్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



కోలాహలంగా యువ సమ్మేళనం

చెన్నేకొత్తపల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): టింబక్టు కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ చిగురు కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక దింతవనం కార్యాలయం ఆవరణంలో కోలాహలంగా యువ సమ్మేళనం నిర్వహించారు. వేదికలో టింబక్టు కలెక్టివ్ వ్యవస్థాపకులు మేరీ, బబ్లూ హాజరై యువత ఆసనరాలు, ఆలోచనలు, ఆశయాలను, లక్ష్యాలను వారి నుంచే తెలుసుకున్నారు. ఆదేవిధంగా గ్రామాలు ఎలా ఉండాలి గ్రామాల కోసం యువత భాగస్వామ్యం తదితర అంశాలపై యువతతో చర్చించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రమేష్, దోహిత, కార్తీక్, విభా, శ్రీకాంత్, జయశ్రీ,పావని పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్


జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక ఆశోకనగర్ డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో ఆదివారం 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కరాటే రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్ పోటీలను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన విజేతల బహుమతుల ప్రదానోత్సవంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అండర్-17 బాలికల విభాగంలో ఇందుమతి, జయశ్రీ, అక్షిత, లీలాంజలి, లీర్తి, భాగ్యలక్ష్మి, దీపిక, వనిత, సింధూజా, సాకియా, నందినిలు విజేతలుగా నిలిచి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14బాలికల విభాగంలో ఎస్విత, కావ్య, సాత్విరెడ్డి, తేజశ్రీ, దివ్యసాయి, దీక్ష లక్ష్మి, రష్మితలు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ కార్పొరేటర్లు సరిపూటి రమణ, రాజారావు, ఎస్‌జీఎఫ్ రెండు జిల్లాల కార్యదర్శులు శ్రీనాథ్‌సాయి, మొరార్జీయాదవ్, సుగుణాబాయి, పీడీలు ఎల్ నాగరాజు, వేణు, కుమార్ రాజా, గట్టు నాగరాజు, ప్రవీణ్‌బాబు, సిరాజ్, దేవకి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ బాలుర క్రికెట్‌లో పలు జట్ల గెలుపు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రామీణ బాలుర క్రికెట్ పోటీల్లో పలు జట్లు గెలుపొందాయి. జిల్లా క్రికెట్ సంఘం, ఆర్డీటీ సంయుక్త ఆధ్వర్యంలో రూరల్ అండర్-15 బాలుర క్రికెట్ లీగ్ పోటీలు ఆదివారం నిర్వహించారు. తపోవనం క్రికెట్ అకాడమీ, మడకశిర జట్ల మధ్య పోటీ జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన తపోవనం జట్టు 38.1ఓవర్లలో 289పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇందులో కౌశిక్ 97 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన మడకశిర 23.5ఓవర్లలో 69పరుగులకు ఆలౌట్ అయ్యింది. తపోవనం బౌలర్ తన్మయి కార్తికేయరెడ్డి 5వికెట్లు పడగొట్టారు. ఇందులో హ్యాట్రిక్ ఉండటం విశేషం. దీంతో తపోవనం జట్టు 220పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో గుంతకల్లు రైల్వేస్, అనంత స్పోర్ట్స్ అకాడమీ జట్లు తలపడ్డాయి. అనంత జట్టు 40ఓవర్లలో 9వికెట్లకు 300పరుగులు చేసింది. బ్యాటర్లు సాత్విక్ 119పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన గుంతకల్లు రైల్వేస్ జట్టు 32ఓవర్లలో 105పరుగులకే ఆలౌట్ కాగా అనంత జట్టు 196పరుగుల తేడాతో విజయం సాధించింది. గుత్తి, పెనుకొండ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో గుత్తి 40ఓవర్లలో 8వికెట్లకు 322పరుగులు చేసింది. ఇందులో నవీన్‌కుమార్ 180 పరుగులు చేశారు. పెనుకొండ 38ఓవర్లలో 232పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో గుత్తి 90పరుగుల తేడాతో గెలుపొందింది. కదిరి, ఎస్ఎస్‌బీఎన్ జట్ల మధ్య జరిగిన పోరులో మొదట బ్యాటింగ్ చేసిన కదిరి 40ఓవర్లలో 6వికెట్లకు 216పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన ఎస్ఎస్‌బీఎన్ జట్టు 22ఓవర్లలో 63పరుగులకే ఆలౌట్ అయ్యింది. సంతోష్ 7 వికెట్లు పడగొట్టాడు. కదిరి 155 పరుగుల తేడాతో విజయం సాధించింది. సెంచరీలు సాధించిన బ్యాటర్లకు జిల్లా

ఉద్యోగుల క్రికెట్ పోటీలు ప్రారంభం

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పాదర్‌పెర్రర్ ఉద్యోగుల క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఏపీ వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్, ఏపీ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఆది వారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో పాదర్‌పెర్రర్ ఉద్యోగుల క్రికెట్ టోర్నమెంట్-2024 పోటీలను ప్రారంభించారు. ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ టాస్ వేసి, బ్యాటింగ్, బౌలింగ్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీ వెటరన్స్ క్రికెట్ అసోసియే షన్, ఏపీ స్పోర్ట్స్ డెవలప్ మెంట్ ట్రస్టు అధ్యక్షుడు మద్దూ రామలింగారెడ్డి, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గురుప్రసాద్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఇన్‌చార్జి సెక్రటరీ భీమలింగారెడ్డి, జ్యుడీషియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్, సభ్యులు విజయరాజు, జయరామిరెడ్డి, బాలాజీనాయక్, షాహీర్, రవినా యక్, గంగాధర్, మురళీ, మారుతి, గంగాధర్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

అనంతపురం టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు పెంచి ఉద్యోగభద్రత కల్పించాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల అసోసి యేషన్ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి అల్లంసురేష్‌బాబు, అమరావతి జేఏసీ జిల్లా చైర్మన్ దివాకర్‌రావు డిమాండ్‌చేశారు. జిల్లాకేం ద్రంలోని రెవెన్యూ అసోసియేషన్ భవనంలో ఆదివారం అనంతపురం, శ్రీసత్యసాయిజిల్లాల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

మౌనగిరిని పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ దంపతులు

రాప్తాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హంపాపురం సమీపం లో ఉన్న మౌనగిరి హనుమాన్ క్షేత్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ తెలిపారు. మౌనగిరి క్షేత్రం ఏడో వార్షికోత్సవం సందర్భంగా పరిటాల కుటుంబ సభ్యులు అక్కడి ఏకశిలా ఆంజనేయస్వామి విగ్రహాన్ని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీతతో పాటు పరిటాల శ్రీరామ్, పరిటాల జ్ఞాన దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పరిసరాల ను మౌనగిరి వ్యవస్థాపకులు ఈశ్వరయ్యతో కలిసి పరిశీలించారు. జాతీయ రహ దారి వద్ద నుంచి ఆలయం వరకు రోడ్డు నిర్మిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. టీడీపీ మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళీ, మండల కన్వీనర్ కొండప్ప, హం పాపురం జయప్ప, మరూరు గోపాల్, పల్లలోవ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


అనంతపురంరూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం ఎంత ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అనంతపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమె ఆదివారం నియోజకవర్గంలోని 15మందికి రూ.11.10 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఆమె పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ...పార్టీలతో సంబంధం లేకుండా ఇలాంటి విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తున్నారని తెలిపారు.

వరిధాన్యానికి పూజలు చేసిన పరిటాల సునీత

రామగిరి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పరిటాలసునీత సొంత వ్యవసా య క్షేత్రంలో పండిన వరిపంటను కోతకోశారు. ఆమె ఆదివారం ఆ ధాన్యాన్ని రాసికట్టించి పూజలుచేశారు. అనంతరం వాటిని సంచులకు నింపి మిల్లుకు తరలించారు. ఈ ఏడాది వరిపంట ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఆమెతెలిపారు. సకాలంలో వర్షాలు రావడం వ్యాధులు తక్కువగా ఉండటంతో పంట దిగుబడి బాగా వచ్చిందన్నారు.

కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి

- ఏఐటీయూసీ నాయకులు


ర్యాలీ చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

అనంతపురం విద్య, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కార్మికులకు కనీస వేతనం కింద రూ. 26 వేలు చెల్లించాలని ఏఐటీయూసీ, సీఐటీయూ, రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ వద్ద 26న నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలంటూ ఆదివారం నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భం గా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లి కార్జున, ఇతర నాయకులు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులు హరి స్తూ చట్టాలను తుంగలోతొక్కి నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చిందన్నారు. కార్పొ రేటర్లకు అనుకూలంగా తీసుకొచ్చిన లేబర్ కోడ్లను రద్దు చేసి 44 కార్మిక చట్టాలను వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశా రు. ఆదేవిధంగా అన్ని వర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. ప్రజాసమస్యలపై 26న కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి జేవీరమణ, నగర అధ్యక్షుడు చిరంజీవి, కార్యదర్శి కృష్ణుడు, ఇతర నాయకులు శ్రీనివాసులు, మల్లి కా ర్జున, కృష్ణానాయక్, వెంకటేష్, దుర్గాప్రసాద్, నాగేం ద్ర, వేణుగోపాల్, నాగేంద్ర ప్రశాంత్, తిరుపాల్, రాము, నారాయణ, బాషా పాల్గొన్నారు.

శ్రీకాకుళంలో ఏఐవైఎఫ్ మహాసభలు

అనంతపురం విద్య, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వచ్చే ఫిబ్రవరిలో శ్రీకాకుళంలో నిర్వహించే ఏఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ పేర్కొన్నారు. సీపీఐ స్థానిక కార్యా లయంలో ఆదివారం సంబంధిత పోస్టర్లను ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. వెనుకబడిన జిల్లాలో చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లేక జిల్లాల నుంచి ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారన్నారు. గత ప్రభుత్వం డ్రగ్స్, గంజాయి నియంత్రణలో పూర్తిగా విఫలమైందన్నారు. యువతను సన్మార్గంలో నడిపే దిశగా ఏఐవైఎఫ్ పనిచేస్తుందన్నారు. ఫిబ్రవరి 6వ తేదీ నుంచి నాలుగు రోజులపాటు ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు జరుగుతాయన్నారు. వాటిని యువత, సీపీఐ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి సంతోష్‌కుమార్, జిల్లా అధ్యక్షులు ఆనంద్,ఇతర నేతలు మోహన్‌కృష్ణ, శ్రీనాథ్, శ్యామ్యూల్, దేవేంద్ర, శ్రీనివాస్, అశోక్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రికి ఘన స్వాగతం


మంత్రి టీజీ భరత్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ

అనంతపురం అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర పరిశ్రమల మంత్రి టీజీ భరత్‌కు ఘన స్వాగతం లభించింది. ఆయన ఆది వారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో కలెక్టర్ వినోద్‌కు మార్, ఎస్పీ జగదీష్, ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు పూల మొక్కలు అందజేసి మనం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లాలో పరిస్థితులు, ప్రభుత్వ పథకాల అమలు తీరు, అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా ఇన్‌చార్జి మంత్రికి కలెక్టర్ వివరించారు. అలాగే మంత్రి టీజీ భరత్‌కు స్థానిక ఆర్అం డ్‌బీ అతిథి గృహంలో టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం, సింగనరం రవి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

సమాజహితం కోసం కవులు ముందుండాలి

- కవి సమ్మేళనంలో ఎంపీ, ఎమ్మెల్యే

అనంతపురం విద్య, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సమాజ హితంలో కవులు ముందుం డాలని, వారి మేధస్సు సమాజానికి ఉపయోగపడాలని వక్తలు పేర్కొన్నారు. నగరంలోని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో ఆదివారం లేపాక్షి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనంత కవితోత్సవం పేరిట కవి సమ్మేళనం నిర్వహించారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గు పాటి వెంకటప్రసాద్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఎంపీ మాట్లాడు తూ... కవులు, రచయితలు, సమాజానికి అద్దం పట్టేలా రచనలు చేయాలని, వారు సమాజాన్ని చైతన్య పర్చాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి మా ట్లాడుతూ... ఎందరో కవులు, కవయిత్రులు జిల్లాలో ఉండటం గర్వకారణం అన్నారు. అనంత కవుల ప్రతిభను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పొట్టూరి హరికృష్ణ, మాజీ కార్పొరేట్ సరిపూటి రమణ, ఇతర నాయకులు, కవులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ క్రీడాకారుల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి టేబుల్‌టెన్నిస్ పోటీలకు జిల్లా బాల, బాలిక క్రీడాకారులను ఎంపిక చేశారు. స్థానిక అనంతపూర్ క్లబ్‌లోని ఇండోర్‌స్టేడియంలో ఆదివారం ఎంపిక పోటీ లు నిర్వహించారు. జిల్లా టేబుల్‌టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కేశవ రెడ్డి, శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. అండర్-15 బాలుర విభాగంలో అఖిల్, ఆత్రిత్, ఆస్రాం, ఆదిత్య ఎంపిక కాగా, బాలికల విభాగంలో జ్యోతిక, ఈషా సంజన, హసిని, సుజనా ఎంపికయ్యారు. సీనియర్ పరుషుల విభాగంలో కె పాలకుమార్, గూడూరు సాయిషా, సాజిద్, పవన్, రాజన్ ఎంపిక కాగా, మహిళల విభాగంలో ఈషా సంజన, హసిని, సులన్య, సుజనా అక్తర్, జ్యోతిక, మనస్విని ఎంపికైన జట్టులో ఉన్నారు. ఎంపికైన క్రీడాకారులు డిసెంబరు మొదటి వారంలో కాకినాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంపై అభిలపక్షం వేయాలి: రాంభూపాల్

అనంతపురం కల్చరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల్లో ప్రజలు మరణిస్తున్న కారణాలపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ ఆదివారం కలెక్టర్ వినోద్‌కుమా ర్‌ను కలిసి కోరారు. ఈ ఒక్క సంవత్సరంలోనే జిల్లాలో 27 మంది వ్యవసా య కూలీలు రోడ్డు ప్రమాదాల్లో మరణించారన్నారు. రోడ్డు ప్రమాదాలకు ఆటో డ్రైవర్లే కారణమంటూ వారిని వేధిస్తున్నారన్నారు. సొంత గ్రామాల్లో పనులు లేకపోవడం, ఉపాధి హామీ నిధులు వేల కోట్లు అక్రమార్కులు కాజేయడమనే కారణాలను ప్రభుత్వం గుర్తించాల్సిన అవసరముందన్నారు.

ఎస్కేయూలో ఎన్‌సీసీ దినోత్సవం

అనంతపురం సెంట్రల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ దినోత్స వాన్ని పురస్కరించుకుని ఆదివారం ఎస్కేయూలో పలు కార్యక్రమాలు నిర్వ హించారు. కల్నల్ మంగేష్ కులకర్ణి, సుబేదార్ మేజర్ బల్వీర్ సింగ్ ముఖ్య అతిథులుగా హాజరై ఎస్కేయూ రిజిస్ట్రార్ రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రతో కలిసి శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన క్యాడెట్లను అభి నందించి బహుమతులు అందజేశారు.

రోడ్డు ప్రమాదం దురదృష్టకరం: దండు

శింగనమల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గార్లదిన్నె వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏనిమిది మంది వ్యవసాయ కూలీలు మృతి చెందడం దురదృష్టకరమని తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు, టీడీపీ సీనియర్ నాయకుడు నార్పల ఆకుల బాబు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. వారు ఆదివారం ఎలుట్ల గ్రామంలో మృతుల అంత్యక్రియలకు హాజరై నివాళులర్పించారు. దండు శ్రీనివాసులు రూ.40 వేలు, ఆకుల బాబు రూ.40 వేలు కలిపి, ఆ ఏనిమిది మంది కుటుంబాలకు రూ.10 చొప్పున దహన సంస్కారాలకు అందజేశారు.

ఆటో ప్రమాదంపై ఎస్పీ సీరియస్

- జిల్లావ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్

అనంతపురం క్రైం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గార్లదిన్నె మండల పరిధిలో జరిగిన ఆటో ప్రమాదంపై జిల్లా ఎస్పీ జగదీష్ సీరియస్ అయ్యా రు. జిల్లావ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం చేపట్టాలని ఆదివారం ఆదేశించారు. సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు ఈ కార్యక్రమం చేపట్టారు. ప్రధానంగా డీజిల్ ఆటోలపైన దృష్టి పెట్టారు. లైసెన్స్, ఇన్సూరెన్స్, పర్మిట్, ఓవర్‌లోడ్, యూనిఫాంపైనా ఆరా తీశారు.

అధికారుల హడావుడి


ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గార్లదిన్నె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తలగాసి పల్లి జంక్షన్ వద్ద 44వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమా దంలో ఏనిమిది మంది కూలీలు మృత్యువాత పడగా మరో ఐదుగురు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. దీంతో జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి వీర్రాజు, కళ్యాణదుర్గం అధికారి రమేష్, అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, హైవే ప్రాజెక్ట్ ఇంజనీర్ వలి, భరత్, అమీన్ తదితరులు ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందని సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌తో పాటు అక్కడ ఉన్న స్థానికులను అడిగి తెలుసుకున్నారు. జాతీయ రహదారిపై ఉన్న జంక్షన్ వద్ద ప్రమాద సూచికలు తదితరాలను పరిశీలించారు. సుమారు గంటకు పైగా జాతీయ రహదారిపైనే తిరుగుతూ ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టేందుకు పరిశీలించారు.

ప్రమాదాల నివారణకు చర్యలు : డీటీఓ

కూలీలు ప్రయాణిస్తున్న ఆటోను ఆర్టీసీ బస్సు ఢీ కొని ఏనిమిది మంది కూలీలు మృతి చెందడంతో పాటు మరో ఐదుగురు తీవ్రంగా గాయపడటం బాధాకరమన్నారు. ప్రమాదాలు చోటుచేసుకోకుండా పలు చోట్ల సూచికలు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటామన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు: సీఐ

ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా అధిక మంది ప్రయా ణికులతో వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని శింగనమల సర్కిల్ సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువమంది ప్రయాణికులతో వెళ్తున్న వాహనా లను ఆదివారం తలగాసిపల్లి సర్కిల్ వద్ద వారు నిలిపి ప్రమాదాలపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్లను హెచ్చరించారు.

క్లుప్తంగా..

పోలింగ్ కేంద్రాల తనిఖీ

పెద్దవడుగూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శిరీష మండలంలోని మిడుతూరు, కాశేపల్లి గ్రామాల్లోని పోలింగ్‌కేంద్రాలను ఆదివారం పరిశీలించారు. 18సంవత్సరాల వయసు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయుటకు చర్యలు తీసుకోవాలని బీఎల్వోలకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన మంత్రి



మాజీ ఎమ్మెల్యేతో మంత్రి టీజీ భరత్

గుత్తి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మాజీ ఎమ్మెల్యే కొట్రికే మధుసూదన్ గుప్తా నివాసానికి రాష్ట్ర పరిశ్రమల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి టీజీ భరత్ ఆదివారం సాయంత్రం వెళ్లారు. మధుసూదన్ గుప్తా మంత్రిని సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి తేనేటివిందు ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సోదరుడు శ్రీహరి, కుటుంబసభ్యులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

బెళుగుప్ప, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాలువపల్లి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అనంతపురానికి చెందిన ముషీర్ చోటా, సూర్య కలిసి బైక్‌పై కళ్యాణదుర్గం నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. అయితే కాలువపల్లి వద్ద పెన్నా బ్రిడ్జి డివైడర్‌ను ప్రమాదవశాత్తూ ఢీకొట్టారు. ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. బైకు నుజ్జునుజ్జయ్యింది. స్థానికులు క్షతగాత్రులను 108లో అనంతపురం ఆస్పత్రికు తరలించారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

పూలకుంట వద్ద మరో ఇద్దరికి..

గుమ్మఘట్ట: మండలంలోని పూలకుంట గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. రాయదుర్గం పట్టణానికి చెందిన గోవిందప్ప, సిద్ధలింగప్ప ఆదివారం బీటీ ప్రాజెక్టు వద్దకు ద్విచక్ర వాహనంలో వచ్చారు. కొద్దిసేపటి తర్వాత స్వగ్రామానికి బయలుదేరారు. అయితే వేగంగా వెళ్తున్న వారు పూలకుంట వద్ద వేగంగా స్పీడ్ బ్రేకర్లపై అదుపు తప్పి కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కురుబలు అన్నిరంగాల్లో రాణించాలి

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- గుంతకల్లులో కనకదాస విగ్రహావిష్కరణ

గుంతకల్లుటౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కురుబలు విద్యావంతులుగా, వ్యాపారవేత్తలుగా, ఇతర అన్ని రంగాల్లోనూ రాణించాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పిలుపునిచ్చారు. కురుబ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని బీరప్ప సర్కిల్లో ఆదివారం భక్త కనకదాస కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందు రైల్వే గ్రౌండ్ నుంచి కనకదాసు చిత్రపటంతో విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, హిందూపురం ఎంపీ పార్థసారథి హాజరయ్యారు. కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించి మంత్రి పూజలు చేశారు. అనంతరం గుంతకల్లప్ప కల్యాణ మండపంలో ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు సోమశేఖర్ అధ్యక్షతన ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భక్త కనకదాసు ఊరూరా తిరుగుతూ తన కీర్తనల చేత ప్రజలను చైతన్య పరిచారని తెలిపారు. అమరావతిలో కనకదాసు విగ్రహం ఏర్పాటు చేయనున్నామన్నారు. తిరుపతిలో కనకదాసు పీఠం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. టీడీపీతోనే కురుబలకు రాజకీయ ప్రాధాన్యం లభించిందన్నారు. ఎంపీ పార్థసారథి మాట్లాడుతూ కురుబలు కనకదాసు అడుగుజాడల్లో నడవాలన్నారు. కురుబలకు అండగా ఉంటామన్నారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ కురుబలు రాజకీయంగా, ఆర్థికంగా ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. కనకదాసును ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు డి. జగదీష్ మాట్లాడుతూ కురుబలు ఐక్యంగా ఉండాలని, కనకదాసులాగా తయారు కావాలన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ మాట్లాడుతూ కురుబల ఐక్యతతో కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. కురుబ యువజన సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కురుబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, మాజీ ఎమ్మెల్యే ఆర్. జితేంద్రగౌడ్, చైర్‌పర్సన్ ఎన్ భవాని, బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళ, కురుబ సంఘం నాయకులు పూజారి బసప్ప, లింగన్న, భవాని మల్లికార్జున, చంద్రశేఖర్, రామప్ప, నారాయణ, మందాలప్ప, వీరభద్రప్ప, మల్లికార్జున, జడ్పీటీసీ కదిరప్ప, టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.



కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సవిత

బెంగళూరులో రోడ్డు ప్రమాదం

- ఉరవకొండ విద్యార్థి మృతి



రామేశ్వర్‌రెడ్డి (ఫైల్)

ఉరవకొండ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): బెంగళూరులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉరవకొండకు చెందిన బీటెక్ విద్యార్థి రామేశ్వర్ రెడ్డి (19) మృతి చెందాడు. పట్టణంలోని భారత్ ఫర్టిలైజర్స్ యజమాని సంజీవరెడ్డి కుమారుడు రామేశ్వర్‌రెడ్డి బెంగళూరులోని దయానందసాగర్ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కాగా శనివారం సాయంత్రం స్నేహితులతో కలిసి పుట్టిన రోజు వేడుకలు ముగించుకుని ఆటోలో హాస్టల్‌కు బయలుదేరాడు. హోరువల్లి, కనకపుర రోడ్డు సమీపంలో ఆటోను కర్ణాటక బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో రామేశ్వర్‌రెడ్డికి తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడు మృతి చెందాడని తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువుల కన్నీరు మున్నీరయ్యారు.

ఎడ్లబండి ఢీకొని ఒకరి మృతి



ప్రభాకర్‌నాయుడు (ఫైల్)

పుట్లూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణరెడ్డిపల్లి క్రాస్ వద్ద ఆదివారం ఎడ్లబండిని ద్విచక్రవాహనం ఢీకొనడంతో యల్లనూరు మండలం కూచివారిపల్లికి చెందిన ప్రభాకర్‌నాయుడు (36) అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రభాకర్‌నాయుడు, అదే గ్రామానికి చెందిన వెంకటేశులు ద్విచక్రవాహనంలో తాడిపత్రికి బయలుదేరారు. నారాయణరెడ్డిపల్లి క్రాస్‌వద్దకు రాగానే రోడ్డు పక్క నుంచి ఉన్నట్టుండి ఎడ్లబండి రోడ్డుపైకి వచ్చింది. ద్విచక్రవాహనం అదుపు చేయలేక ఆ బండిని ఢీకొట్టారు. దీంతో ప్రభాకర్‌నాయుడు అక్కడికక్కడే మృతిచెందాడు. వెంకటేశులుకు గాయాలవగా చికిత్స నిమిత్తం తాడిపత్రికి తరలించారు. మృతుడి తమ్ముడు హరిప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హేమాద్రి తెలిపారు. మృతుడికి భార్య సాయిలత, మూడేళ్ల కుమార్తె స్నేహచౌదరి, 9నెలల కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మరొకరు..

బొమ్మనహాళ్: మండలంలోని శ్రీనివాసక్యాంప్ సమీపంలో బళ్లారి - కళ్యాణదుర్గం రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మండలంలోని దేవగిరిక్రాస్‌కు చెందిన కొండయ్య (75) శ్రీనివాసక్యాంప్ సమీపంలోని పొలంలో ఆదివారం పనులు చూసుకుని బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. కాగా బెంగుళూరుకు చెందిన గోవర్ధన్ మంత్రాలయానికి మరో బైక్‌పై వెళ్తూ.. కొండయ్య బైక్‌ను ఢీ కొట్టాడు. ప్రమాదంలో కొండయ్యకు తీవ్రగాయాలవగా.. గోవర్ధన్ స్వల్పంగా గాయపడ్డాడు. కొండయ్యను ప్రైవేటు వాహనంలో బళ్లారి విమ్స్‌కు తరలించగా మార్గంమధ్యలో చనిపోయినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. పోలీసులు సంఘటనస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

రాష్ట్రస్థాయి హాకీ జట్టుకు అభిలాష్

విడపనకల్లు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని హావళిగి గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి అభిలాష్ రాష్ట్ర స్థాయి హాకీ జట్టుకు ఎంపిక అయినట్లు పీడీ రాకేష్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. కాకినాడలో ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకూ జరిగిన స్కూల్ గేమ్స్ హాకీ టోర్నీ అండర్- 19 సీనియర్ విభాగంలో అభిలాష్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికయ్యాడన్నారు. డిసెంబరు 9 నుంచి 15వ తేదీ వరకూ రాంచీలో జరిగే జాతీయస్థాయి హాకీ పోటీలలో పాల్గొననున్నట్లు చెప్పారు. అభిలాష్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

నూర్‌బాషా కులస్థులకు మైనార్టీ హోదా కల్పించాలి

గుత్తి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జనాభాలో పది శాతం ఉన్న నూర్ బాషా కులస్థులకు రాజకీయాలకతీతంగా ప్రభుత్వం మైనార్టీ హోదా కల్పించాలని ఆ కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాజీ, రాష్ట్ర కమిటీ సభ్యుడు, టీడీపీ యువనేత ఉమర్ ముక్తార్ కోరారు. పట్టణంలోని షాదీ ఖానాలో ఆదివారం నూర్‌బాషా ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యం లో జరిగిన ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఇందులో బాజీ, ఉమర్ ముక్తార్ మాట్లాడుతూ ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడిన నూర్‌బాషా కులస్థులకు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వాలని కోరారు. తొలుత ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి షాదీ ఖానా వరకు ర్యాలీ నిర్వహించారు. సంఘం రాష్ట్ర కన్వీనర్ సిద్దయ్య, రాష్ట్ర కోఆర్డినేటర్ ఖాసీం, మీడియా కోఆర్డినేటర్ అబ్దుల్‌రజాక్, మండల అధ్యక్షుడు చాంద్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, నాయకులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

నూర్‌బాషా ముస్లిం వెల్ఫేర్ సొసైటీ గుత్తి మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చాంద్‌బాషా, కార్యదర్శిగా కుళ్లాయి, గౌరవాధ్యక్షులుగా వన్నూర్‌సాబ్, వన్నూర్‌బీ, సీఎం బాషా, ఎరుకలప్ప, మహమ్మద్‌అలీ, హుసేనప్ప, కోశాధికారులుగా మాబు, మీరామోదీన్‌తో పాటు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఘనంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జయంతి



ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జేసీపీఆర్

తాడిపత్రి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంగ్లేయులపై తిరుగుబాటు చేసిన ఉయ్యాల వాడ నరసింహారెడ్డి జయంతి వేడుకలను పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్ సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆంగ్లేయులపై తిరుగుబాటు చేసి ప్రాణాలర్పించిన ధీశాలి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని కొనియాడారు. కార్యాక్రమంలో టీడీపీ నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, రెడ్లసంఘం అధ్యక్షుడు పిచ్చిరెడ్డి, నాయకులు హరినాథ్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, చింబిలి ప్రసాద్‌నాయుడు, రంగనాథరెడ్డి పాల్గొన్నారు.

వ్యాపారులతో సమావేశం..

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో జేసీపీఆర్ స్థానిక పలు వ్యాపారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కిరాణా, మండీమర్చంట్, సూపర్‌మార్కెట్ నిర్వాహకులతో మాట్లాడుతూ.. పట్టణ అభివృద్ధికోసం సహాయ సహకారాలు అందించాలని కోరారు. పట్టణాన్ని స్వచ్ఛంగా పరిశుభ్రంగా ఉంచుకుందామని పిలుపునిచ్చారు. పట్టణం అభివృద్ధికి ప్రతిఒక్కరూ నడుం బిగించాలని ఆయన సూచారు.

నెట్టికంటి సన్నిధిలో ప్రముఖులు



ఆలయంలో ఆంజనేయస్వామిని దర్శిస్తున్న ఎంపీ పార్థసారథి, విశ్రాంత ఐఏఎస్ అధికారి లక్ష్మీనారాయణ

గుంతకల్లు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామిని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, విశ్రాంత ఐఏఎస్ అధికారి లక్ష్మీనారాయణ ఆదివారం ఉదయం దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు సాదర స్వాగతం పలికి స్వామి దర్శనం చేయించారు. పూజలు, అర్చనలు జరిపించి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు పలికారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

గుంతకల్లు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైల్వేలో పనిచేస్తున్న ఖ్వాజీ ఎంప్లాయిస్‌కు ఉద్యోగ భద్రతను కల్పించాలని ఆ సంఘం అధ్యక్షుడు రాజ్ కుమార్, సామాజిక ఉద్యమకారుడు ఎండీ ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. రెల్వే ఖ్వాజీ రైల్వే స్టాఫ్ అసోసియేషన్ గుంతకల్లు రైల్వే డివిజనల్ సర్వసభ్య సమావేశం ఆదివారం ఉదయం స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వేలో ఖ్వాజీ అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్ వెట్టిచాకిరీ చేయిస్తున్నారన్నారు. నలభై ఏళ్ల కిందట రూ. 150 ల జీతంలో ఉద్యోగంలో చేరిన వ్యక్తి కేవలం రూ. 9 వేలతో రిటైరయ్యాడన్నారు. ఇది రైల్వే దోపిడీకి, వెట్టిచాకిరీకి నిదర్శనమన్నారు. ఖ్వాజీ ఉద్యోగుల వెట్టిచాకిరీని అరికట్టి, వారికి ఉద్యోగ భద్రతను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఇదుర్‌బాషా, సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అమిలినేనికి ఘన సన్మానం



పావగడలో అమిలినేనిని సన్మానిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం పావగడలో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు అపూర్వ స్వాగతం లభించింది. పావగడలో కమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్తీక వన భోజన మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనకు ట్రస్టు సభ్యులు ఘన స్వాగతం పలికారు. అలాగే పూలమాల లు, శాలువాతో సన్మానించి మెమొంటోను అందించారు. తర్వాత ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి కార్తీక వన భోజన మహోత్సవాన్ని ప్రారంభించారు.

రక్తదానం చేసి ప్రాణాలు నిలపండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రక్తదానం చేసి ప్రాణాలు నిలపాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సూచించారు. పట్టణంలోని ఈద్గా ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రెడ్ డ్రాప్ బ్లడ్ ఆర్గనైజేషన్ 13వ వార్షికోత్సవం సందర్భంగా రక్తదాతలకు పురస్కారాల ప్రదానం చేశారు. ముఖ్య అతిథి ఎమ్మెల్యే హాజరై రక్తదాతలకు పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యవంతులందరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడాలని అన్నారు. టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంత విద్యార్థులకు సీఐ అభినందనలు

తాడిపత్రి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో ఈనెల 10వ తేదీన జరిగిన నేషనల్ కరాటే చాంపియన్‌షిప్‌లో తాడిపత్రికి చెందిన 20 మంది విద్యార్థులు ప్రతిభ చూపి మెడల్స్‌తో పాటు సర్టిఫికెట్లు గెలుపొందారు. దీంతో వారిని ఆదివారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ శివగంగాధర్ అభినందించారు. కోచ్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా కనకదాస జయంతి



పులకుర్తిలో కనకదాస జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాలవ

డీ.హీరేహాళ్/ బొమ్మనహాళ్/ కణేకల్లు/ గుమ్మఘట్ట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): భక్త కనకదాసు జయంతి వేడుకలను డీ. హీరేహాళ్ మండల పులకుర్తి గ్రామంలో కురుబలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరై కనకదాస చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా అందరూ పూజించ దగ్గ గొప్ప మహనీయుడు భక్త కనకదాస అని తెలిపారు. అనంతరం కురుబలు కనకదాస విగ్రహాన్ని ఊరేగించారు. తర్వాత ఎమ్మెల్యే ను, ఇతర నాయకులను శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. టీడీపీ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్‌రెడ్డి, సర్పంచ్ దోనప్ప తదితరులు పాల్గొన్నారు. అలాగే బొమ్మనహాళ్ మండలం నేమకల్లు గ్రామంతో పాటు కణేకల్లు, గుమ్మఘట్ట మండలకేంద్రాల్లో కురుబలు కనకదాస జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు.